క్లుప్తంగా

ఉత్తమ సేవలకు సత్కారం

తాళ్లరేవు: అత్యుత్తమ వైద్య సేవలు అందించడంతో పాటు ఆరోగ్యశ్రీ పథకంలో ఎక్కువ సర్జరీలు చేసినందుకు ప్రభుత్వం నుంచి డాక్టర్ చవ్వాకుల శేషగిరిరావు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ మేరకు ఆయన్ని ది పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కాకినాడలోని అరుణ ఆస్పత్రికి వెళ్లి వైద్యుడు చవ్వాకుల శేషగిరిరావును పీఎంపీ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. అసోసియేషన్ జిల్లా గౌరవ సలహాదారుడు కేఎస్ఎన్ బాబు, జిల్లా కోశాధికారి కేఎస్ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు జేవీవీ సూర్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని తాళ్లరేవు వద్ద ఈ నెల 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉమ్మిడిశెట్టి మణికంఠ (24) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ తెలిపారు. సామర్లకోట సమీపంలోని ఉండూరు గ్రామానికి చెందిన మణికంఠ మరో యువకుడితో కలసి యానాం వెళ్లాడు. అక్కడ నుంచి తిరిగి వస్తూ ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ నేపథ్యంలో కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

బీజేపీ మన్ కీ బాత్ కార్యక్రమం

అమలాపురం రూరల్: బీజేపీ పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమం నిర్వహించారు. స్థానికంగా టెలివిజన్‌లో ప్రధాని మోదీ ప్రసంగాన్ని బీజేపీ నాయకులు ఆసక్తిగా విన్నారు. పార్టీ రాష్ట్ర కార్మికుల కన్వీనర్ ఆకుల వీరబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు అరిగెల వెంకటరామారావు, ఎస్సీ మోర్చా జోన్ ఇన్‌చార్జి దూరి రాజేష్, నాయకులు కొండేటి ఈశ్వర్‌గౌడ్, బొంతు శివాజీ, అరిగిరి తేజ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి సత్కారం



ప్రవీణ్‌కుమార్, వెంకటేశ్వరరావులను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన గంటి ప్రవీణ్‌కుమార్, పట్టణ పార్టీ కార్యదర్శిగా నియమితులైన మొల్లేటి వెంకటేశ్వరరావులను నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక సూర్యనగర్‌లో ఆదివారం సత్కరించారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు వంటెద్దు బాబి అధ్యక్షతన ఈ సభ జరిగింది. వారిని ఏపీసీసీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ డాక్టర్ దేవరపల్లి రాజేంద్రబాబు, ఏపీసీసీ అధికార ప్రతినిధి ముషిణి రామకృష్ణారావు, మండల పార్టీ అధ్యక్షుడు కుడుపూడి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షుడు నుగ్గు ప్రసాద్, యార్లగడ్డ రవీంద్ర తదితరులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

యానాం: పుదుచ్చేరి గోరిమేడు క్రీడా మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో యానాం పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారని ఆదివారం ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలికి ప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాలు జరిగిన ఈ పోటీలకు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల నుంచి 80 మంది విద్యార్థులు పోటీపడ్డారు. అండర్–14, 16 బాలుర పరుగుపందెంలో డి.జాషువా ద్వితీయ, అండర్–19 వంద మీటర్ల పరుగులో జి.దిలీప్ వెంకట్ ప్రథమ, డిస్కస్ త్రోలో ప్రథమ, 800, 1500 మీటర్లలో బాబీప్రసాద్ తృతీయ, అండర్–17 బాలికల విభాగంలో 200, 400, 800 మీటర్ల పరుగులో వీఎస్ స్వాతిశ్రీ ద్వితీయ స్థానాన్ని సాధించారన్నారు. వీరంతా సీఎం రంగసామి చేతుల మీదుగా బహుమతులు అందుకోనున్నారని వివరించారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



శిక్షణ కార్యక్రమంలో డీఆర్వో సత్తిబాబు, రెడ్‌క్రాస్ సభ్యులు

అమలాపురం రూరల్: స్థానిక కలెక్టరేట్‌లో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై శిక్షణ శిబిరం నిర్వహించారు. దీనిని డీఆర్వో సత్తిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకుని ఆపద కాలంలో సేవలు అందించాలన్నారు. తద్వారా క్షతగాత్రులకు బాసటగా నిలవాలని కోరారు. రెండో విడత శిక్షణ కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రెడ్‌క్రాస్ సంస్థ కార్యదర్శి డాక్టర్ పీఎస్ శర్మ పలు అంశాలు వివరించారు. శిక్షణలో 12 మందికి పత్రాలు అందించారు. కమిటీ సభ్యులు ఎస్.కృష్ణమూర్తి, ఎం.ఆదినారాయణ, కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు

హమ్మయ్యా.. కాస్త ఊరట

- తగ్గుతున్న పందుల మరణాలు
- నేటి నుంచి ముందస్తు వ్యాక్సినేషన్



అమలాపురంలో పందుల పెంపకందార్లకు సూచనలు చేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు విజయారెడ్డి

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం, పరిసర గ్రామాల్లో పందుల మరణాలు క్రమేపీ తగ్గుముఖం పట్టాయి. ఇరవై రోజులుగా అంతు చిక్కని వ్యాధితో వందలాది వరాహాలు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై అటు మున్సిపాలిటీ, ఇటు పశు సంవర్ధక శాఖ అధికారులు దృష్టి సారించారు. ఇప్పటికే సుమారు ఆరు వందల పందులు మృత్యువాత పడడంతో నాలుగు రోజుల కిందట జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జయపాల్, సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.వి జయారెడ్డి ఆధ్వర్యంలో కాకినాడ నుంచి ప్రత్యేక వైద్య బృందం అమలాపురానికి వచ్చి చనిపోయిన పందులకు పోస్టుమార్టం నిర్వహించారు. రక్త నమూనాలు సేకరించి విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. పట్టణం, పరిసర గ్రామాల్లో పందుల మాంసం విక్రయాలను పూర్తిగా నిషేధించారు. అలాగే వైరస్ సోకి తుప్పలు, వినియోగంలో లేని పాడుపడిన భవనాల్లో చనిపోతున్న పందుల సమాచారాన్ని తక్షణమే మున్సిపాలిటీకి అందించాలని.. పందుల మాంసం అమ్మకాలను నిషేధించామని పట్టణంలో ఆటోల ద్వారా విస్తృత ప్రచారం చేసినట్లు మున్సిపాలిటీ పారిశుధ్య పర్యవేక్షణ ఏఈ వెంకటేశ్వరరావు తెలిపారు. పందులకు రోగ నిరోధక శక్తినిచ్చే మందులను పంపిణీ చేస్తున్నారు. మిగిలిన పందులు వైరస్ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలను పెంపకందార్లకు పశు వైద్యాధికారులు వివరిస్తున్నారు. ఇన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో ఇప్పుడు పందుల మరణాలు క్రమేపీ తగ్గుతున్నాయి. మొన్నటి వరకూ రోజుకు 50కి పైనే పందులు చనిపోతే రెండు రోజులుగా రోజుకు 10 నుంచి 20 మాత్రమే మరణిస్తున్నాయి. ముందస్తు జాగ్రత్తలతో మరణాలు క్రమేపీ తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

మూడు రోజుల్లో నివేదిక

చనిపోయిన పందులకు చేసిన పోస్టుమార్టం నివేదిక కాకినాడ వ్యాధి నిర్ధారణ పరిశోధన కేంద్రం నుంచి మరో మూడు రోజుల్లో వస్తుందని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. ఆ నివేదిక వచ్చిన తర్వాత గుర్తించిన వైరస్ నివారణకు మందులు ఇవ్వడం ద్వారా పందులను కాపాడుకునే ప్రయత్నాలు జరుగుతాయని చెప్పారు. దీనికి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.

వైరస్ బారిన పడకుండా..

పందులు ఏ కారణంతో చనిపోతున్నాయో నివేదిక వచ్చే లోపు ఎలాంటి వైరస్ బారిన పడకుండా మిగిలిన ఆరోగ్యంగా ఉన్న పందులకు ముందస్తుగా రింగ్ వ్యాక్సినేషన్ చేపడుతున్నట్లు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ విజయారెడ్డి తెలిపారు. అమలాపురం, పరిసర ప్రాంతాలకు సంబంధించి 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్న పందుల పెంపకందార్ల ప్రాంతాలకు వైద్య బృందం వెళ్లి పందులకు క్లాసికల్ స్వైన్ ఫీవర్ వ్యాక్సిన్లు వేస్తామన్నారు. సోమవారం నుంచి ఈ రింగ్ వ్యాక్సినేషన్ మొదలు పెడుతున్నట్లు ఆయన వివరించారు.

సీఎం జగన్‌తో అవినీతి రహిత పాలన



ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

- ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్
- పాతయింజరంలో గడప గడపకూ..

ఐ.పోలవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగుతుందని, పార్టీలకు అతీతంగా అందరికీ పథకాలు అందుతున్నాయని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఆదివారం ఐ.పోలవరం మండలం పాతయింజరం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఆయన ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. పథకాలతో అందిన లబ్ధిపై కరపత్రాలు అందించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ అర్హులందరికీ పథకాలు అందించడమే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలను ఓట్లు అడిగే అర్హత ఒక్క వైఎస్సార్ సీపీకే ఉందన్నారు. తమ ప్రభుత్వానికి విశేష ఆదరణ లభిస్తుందని, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయం ఖాయమన్నారు. కరోనా సమయంలో రాష్ట్ర ఆదాయం పడిపోయినా ముఖ్యమంత్రి పేదల సంక్షేమం విషయంలో వెనకడుగు వేయలేదని ఆయన అన్నారు. అన్ని సంక్షేమ పథకాలను నిర్ణీత తేదీల్లో అమలు చేశారని కొనియాడారు. అలాంటి జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్తరాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, కాటం సత్తిరాజు, కొండేపూడి కృపావరప్రసాద్, దొమ్మేటి దుర్గాప్రసాద్, మోర్త చిన్నా, పెమ్మాడి బాబూరావు, సఖిలే వెంకటేశ్వరరావు, బుజ్జి తదితరులు ఉన్నారు.

రాజ్యాధికారమే బహుజనుల లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న వీజేఆర్ నారగోని

ముమ్మిడివరం: బహుజనులంతా ఏకమై ఫ్రంట్‌గా ఏర్పడి రాజ్యాధికారమే లక్ష్యంగా రాబోయే ఎన్నికలలో పోటీ చేయాలని రాజ్యాధికారి పార్టీ జాతీయ అధ్యక్షుడు వీజేఆర్ నారగోని అన్నారు. శనివారం ముమ్మిడివరంలో విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేంద్రంలో ఓబీసీల జనగణనను చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. సీహెచ్ బాలకృష్ణ మాట్లాడుతూ బహుజనులకు సంక్షేమ పథకాలు అవసరం లేదని, రాజ్యాధికార దిశగా బహుజనులు ఏకమై పయనించాలన్నారు. అగ్రకుల పార్టీలు బహుజనుల మధ్య చిచ్చుపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయని, వారి ప్రలోభాలకు లోను కాకుండా ఐకమత్యంగా సాగాలన్నారు. సమావేశంలో రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వీరంకి అయ్యన్నగౌడ్, పీవీఆర్ యాదవ్, మేడిశెట్టి తిరుపతిరావు, రేవు శ్రీనివాసరావు, గుత్తుల శివకోటి, మెండి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

వై.జంక్షన్‌లో చెక్‌పోస్టు ఏర్పాటు

తాళ్లరేవు: కేంద్రపాలిత ప్రాంతం యానాం నుంచి మద్యం తదితర మత్తు పదార్థాలు అక్రమంగా తరలించకుండా చెక్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నట్లు కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ తెలిపారు. దీనిని ప్రయోగాత్మకంగా పోలేకుర్రు పంచాయతీ వై.జంక్షన్ వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో సుంకటరేవు, యానాం బైపాస్ రహదారిలో ఏర్పాటు చేశామన్నారు. వీటి స్థానంలో వై.జంక్షన్ వద్దకు మార్పు చేశామన్నారు. మత్తు పదార్థాలను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైల్వే లైన్ కోసం బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ చేస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: కోటిపల్లి– నర్సాపురం రైల్వే లైన్ నిర్మాణం సకాలంలో పూర్తి చేసి, ఇక్కడి ప్రజల చిరకాల కోరిక తీర్చాలనే డిమాండ్‌తో కోనసీమ జిల్లా రైల్వే సాధన సమితి ఆధ్వర్యాన ఆదివారం 60 కిలోమీటర్ల బైక్ ర్యాలీ నిర్వహించారు. అయినవిల్లి మండలం ముక్తేశ్వరం నుంచి సఖినేటిపల్లి వశిష్ట గోదావరి రేవు వరకూ ఈ ర్యాలీ జరిగింది. రైల్వే లైన్ నిర్మాణం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి, తగిన నిధులు మంజూరు చేయాలని సమితి ప్రతినిధులు కోరారు. ముక్తేశ్వరంలో వర్తక సంఘం నాయకుడు గుత్తల భాస్కరరావు జెండా ఊపి బైక్ ర్యాలీ ప్రారంభించారు. అమలాపురం, బోడసకుర్రు, నగరం, తాటిపాక, రాజోలు, మలికిపురం మీదుగా సఖినేటిపల్లి ఫెర్రీకి ర్యాలీ చేరుకుంది. సమితి కన్వీనర్లు బొంతు రమణ, రేవు తిరుపతిరావు, కారెం వెంకటేశ్వరరావు, గంగుమళ్ల శ్రీనివాసరావు, బొంతు బాలరాజు, పరమట శ్యామ్, డాక్టర్ మధుర నరసింహమూర్తి తదితరులు ర్యాలీకి నాయకత్వం వహించారు.

బెల్లం బట్టీ దగ్ధం

రాజోలు: బెల్లం కట్టలు భద్రపరిచేందుకు వినియోగించే బెల్లం బట్టీ ఆదివారం ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. తాటిపాక గ్రామానికి చెందిన పాటబళ్ల బలరాంకు చెందిన సుమారు 250 బెల్లం కట్టలు అగ్నికి కాలిపోయాయి. సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి గణేశ్వరరావు తెలిపారు. బట్టీ నుంచి మంటలు వ్యాపించడంతో స్థానికులు సమాచారం ఇచ్చారని హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశామన్నారు.

సత్తెమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



గొల్లవిల్లిలో ప్రత్యేక అలంకరణలో సత్తెమ్మతల్లి



ఐ.పోలవరంలో సత్తెమ్మతల్లి



యానాంలో భద్రావతీ సమేత భావనారుషి స్వామివారు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి గ్రామ ఓఎన్జీసీ సెంటర్ సమీపంలో సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక కుంకుమ పూజ లు నిర్వహించారు. పోశింశెట్టి వెంకట సూర్యనారాయణ, లక్ష్మీ సత్యశ్రీ దంపతుల సహకారంతో అమ్మ వారి ఆలయానికి పుష్పాలంకరణ చేశారు. రోజూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మంగళవారం జాతర సందర్భంగా భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని కమిటీ నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా సహస్రనామార్చన

యానాం: స్థానికంగా కొలువైన శ్రీభద్రావతీ సమేత భావనారుషి స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం స్వామివారికి గులాబీలతో సహస్ర నామార్చన నిర్వహించారు. అనంతరం విష్ణుసహస్ర నామ స్తోత్ర పారాయణం, నీరాజన మంత్రపుష్పాలు, ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో పద్మశాలీ సేవా సంఘం అధ్యక్షుడు ఆదిమూలం కృష్ణ, ఒగ్గు భావనారుషి తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం: స్థానికంగా సత్తెమ్మ తల్లి జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో మంగళ వాయిద్యాలు, కోలాటాలతో భారీ ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిగింది. గ్రామంలో విశ్రాంత ఉపాధ్యాయులు, వాస్తు పండితులు ఆకొండి సీతారామంను సత్కరించారు.

మహాసౌర యాగ పూజలు

ఉప్పలగుప్తం: పవిత్ర మాఘమాసాన్ని పురస్కరించుకుని విలసవిల్లి గ్రామంలో రామాలయం వద్ద మహా సౌరయాగ పూజలు జరుగుతున్నాయి. ఆదివారం యాగకర్త మున్నంగి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో సూర్య భగవానుని ఆకారపు రాగి ప్రతిమలతో సూర్య యంత్రాన్ని అమర్చి సౌర అష్టాకరి జపాలు చేశారు. అరుణ హోమం నిర్వహించారు. భరణీ నక్షత్ర జాతకులచే ఉసిరి మొక్కకు ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

భారత రిపబ్లికన్ పార్టీ మహాసభ



మహాసభలో మాట్లాడుతున్న రిపబ్లికన్ పార్టీ హైదరాబాద్ అధ్యక్షుడు మహేష్‌బాబు

అమలాపురం టౌన్: భారత రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర మహాసభ స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లో ఆదివారం జరిగింది. పార్టీ జిల్లా అధ్యక్షుడు గిడ్డి జ్ఞాన ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం రుషి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ 75 స్థానాల్లో పోటీ చేస్తుందని మహాసభ తీర్మానం చేసింది. సొంతంగా స్థలాలున్న వారికి ప్రభుత్వం వ్యక్తిగత హౌసింగ్ స్కీమ్ అమలు చేయాలని కోరింది. పార్టీ హైదరాబాద్ అధ్యక్షుడు మహేష్‌బాబు, నాయకులు బడుగు సత్యనారాయణ, ఈవీవీ సత్యనారాయణ, దడాల రామకృష్ణ, సీహెచ్ కృష్ణమూర్తి, సిద్ధార్థ గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ కమిటీలతో ప్రజా సమస్యల గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చిట్టిబాబు

మామిడికుదురు: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను బూత్ కమిటీల ద్వారా సేకరించి వాటి పరిష్కారానికి కార్యాచరణ చేపడతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రి చిట్టిబాబు పేర్కొన్నారు. మండల శాఖ అధ్యక్షుడు మెండా ఆదినారాయణ అధ్యక్షతన స్థానికంగా ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో చిట్టిబాబు పాల్గొన్నారు. ఫిబ్రవరి రెండున పి.గన్నవరం మండలం చాకలిపాలెంలో జరిగే భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో చర్చించే అంశాలపై సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 1న మామిడికుదురు, రాజోలు, పి.గన్నవరం మండలాల్లో జరిగే విస్తారక్ యోజన ద్వారా శక్తి కేంద్రాల్లో ఉన్న బూత్ కమిటీలను పూర్తి చేస్తామన్నారు. ఆ కమిటీల ద్వారా సమస్యలను గుర్తించి ఆయా శాఖాధికారులతో మాట్లాడతామన్నారు. సమావేశంలో పార్టీ నేతలు అడబాల సత్యనారాయణ, విళ్ల దొరబాబు, పితాని శ్రీనివాసరావు, యర్రంశెట్టి సాయిబాబు, వడ్లమూడి ప్రకాష్, అడపా వీరవెంకటరత్నం, పితాని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గంజాయితో ఇద్దరి అరెస్టు

మలికిపురం: మండలంలోని గూడపల్లి పల్లిపాలెంలో గంజాయి కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రాజోలు కోర్టుకు పంపినట్లు ఎస్సై హరికోటి శాస్త్రి ఆదివారం తెలిపారు. ఈ కేసులో మందా రవికుమార్, కట్టా కిరణ్‌లను కలిగి ఉన్న 50 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిందితులకు కోర్టు రిమాండ్ విధించగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు ఆయన వివరించారు.

అక్రమ డీజిల్ వ్యాపారంపై ఫిర్యాదు

సఖినేటిపల్లి: అంతర్వేది ఏరియాలో ప్రభుత్వం నుంచి ఏ విధమైన అనుమతులు లేని బయోడీజిల్ బంకుల ద్వారా అక్రమంగా డీజిల్ వ్యాపారం సాగిస్తున్నారని పౌరసరఫరాల అధికారులకు ఫిర్యాదు చేసినట్టు వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాస నగేష్ ఆదివారం తెలిపారు.

విఘ్నేశ్వరుని సన్నిధిలో జూనియర్ సివిల్ జడ్జి

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరుని ఆలయాన్ని రాజమహేంద్రవరం మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఆర్.వరలక్ష్మి ఆదివారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆమెకు అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆమెను వేదపండితులు వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

సూర్య నమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం



యానాంలో సూర్య నమస్కారాల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

యానాం: రోజూ క్రమం తప్పకుండా సూర్య నమస్కారాలు చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అమలాపురం సేవాభారతి కార్యదర్శి అమ్మిరాజు అన్నారు. ఆదివారం స్థానిక బాలయోగి స్టేడియంలో సేవాభారతి, ఆర్ఎస్ఎస్ యానాం శాఖల ఆధ్వర్యంలో సూర్య నమస్కారాల పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్య నమస్కారాల ప్రాధాన్యాన్ని వివరించారు. అనంతరం జరిగిన పోటీల్లో 154 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. కె.సిద్ధార్థ ప్రథమ, ఎం.లక్ష్మణ్ ద్వితీయ, ఎం.రాము తృతీయ బహుమతులు సాధించారు. అదేవిధంగా కె.చరణ్, పి.మధు మహాలక్ష్మీరావు, ఎస్.పవన్‌లు ప్రోత్సాహక బహుమతులు పొందారు. కార్యక్రమంలో చేకూరి రవివర్మ, కంచర్ల వీర్రాజు, ఎస్‌పీవీ రామారావు, నల్ల వెంకన్న, తుపాకుల ప్రసాదరావు, నరహరిశెట్టి అబ్బులు, ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాల్లో నీటి సమస్య తీర్చుతా..



పల్లంలో తాగునీటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్

కాట్రేనికోన: తీర ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తానని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. మండలంలోని పల్లం గ్రామంలో సర్పంచ్ మల్లాడి వీరబాబ్జి ఆధ్వర్యంలో తాగునీరు ప్రాజెక్టుకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తీర ప్రాంత ప్రజలు ఎన్నో ఏళ్లుగా తాగునీటి విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇక నుంచి అందరికీ తాగునీరు అందేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని అన్నారు. సీఎస్ఆర్ నిధులు రూ.4.5 కోట్లతో ప్రాజెక్ట్ పనులను, రిలయన్స్ వారి సౌజన్యంతో రూ.50 లక్షలతో మైక్రో ఫిల్టర్ పనులను చేపడుతున్నామని అన్నారు. దీంతో సమస్య తీరుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, నాయకులు పాలేపు ధర్మారావు, నడింపల్లి సూరిబాబు, యేడిద చక్రపాణి, నల్లా నరసింహమూర్తి, యేడిది సుబ్బారావు, సంసాని నాగేశ్వరరావు, నాతి సత్యనారాయణ, గంటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఉత్తీర్ణత సాధించాలి



స్టడీ మెటీరియల్‌ను ప్రదర్శిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి తదితరులు

అమలాపురం టౌన్: పదో తరగతి విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న స్టడీ మెటీరియల్ ఉపయోగపడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. స్థానిక వెత్సావారి అగ్రహారంలో మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఆమె ఆదివారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం బీఆర్ కామేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కల్వకొలను ఉమ మరో అతిథిగా పాల్గొని స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్‌పర్సన్ నల్లా వెంకట గీతామణి, జనసేన నాయకుడు పిండి రాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



మార్కెట్ భవనంలో సమావేశమైన రైసుమిల్లుల కార్మికులు

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలోని రైసు మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని పలువురు కార్మిక నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మార్కెట్ భవనంలో సాధనాల నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ యానాంలో రైసుమిల్లులు కొంతకాలంగా సరిగ్గా నడవకపోవడంతో కార్మికులకు పూర్తి స్థాయిలో పని ఉండటం లేదన్నారు. దీంతో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలని, లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ కార్యదర్శి పెయ్యల వెంకటేశ్వరరావు, దాసరి రాజు, దొమ్మేటి సూరిబాబు, సబ్బతి రాంబాబు, వడ్డి నాగేశ్వరరావు, సత్తిబాబు, వై శ్రీను, కార్మికులు పాల్గొన్నారు.

వశిష్ట సేవాశ్రమంలో విగ్రహాల ప్రతిష్ఠ



పల్లిపాలెం సేవాశ్రమంలో నిర్వహించిన పలు ప్రతిష్ఠల్లో పాల్గొన్న ప్రసాదరాజు తదితరులు

సఖినేటిపల్లి: అంతర్వేది ఏటిగట్టు దిగువన పల్లిపాలెం గ్రామ పరిధిలోని వశిష్ట సేవాశ్రమంలో సకల దేవతల ప్రాణప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా గత రెండు రోజులుగా విశేష కార్యక్రమాలు నిర్వహించినట్టు ఆశ్రమ గురువు ప్రసాదరాజు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా ప్రముఖులతో చతుఃషష్ఠి యోగిని మహాప్రాకార మండపం ఉద్ఘాటన, అక్షర సహిత నక్షత్ర దేవతా ప్రతిష్ఠ, గోపుర కలశ ప్రతిష్ఠ ధ్వజస్తంభ ప్రతిష్ఠలు కనుల పండువగా చేశామన్నారు. వీటితో పాటు కమలాత్మకాదేవి ప్రతిష్ఠ, రుగ్వేద గోపుర కలశ ప్రతిష్ఠ, తారాదేవి ప్రతిష్ఠ నిర్వహించినట్టు గురువు ప్రసాదరాజు అన్నారు.

నేడు సుబ్రహ్మణ్యస్వామికి కుంభాభిషేకం

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీవల్లీ, దేవసేన సమేత బాలసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కుంభాభిషేకం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపకుడు చెల్లుబోయిన నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. దీనిలో భాగంగా ఉదయం వైనతేయ తీరానికి వెళ్లి గోదావరి జలాలు తీసుకువచ్చి అభిషేకం నిర్వహిస్తామన్నారు. తదుపరి ఆలయ శిఖరంపై బూరెలు వేస్తామన్నారు. మధ్యాహ్నం హోమం, శాంతి కల్యాణం జరుగుతుందన్నారు. ఈ పూజలకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.